క్లుప్తంగా

పారదర్శకంగా రీ సర్వే



చినరామభద్రపురంలో రీ సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్ మూర్తి

నక్కపల్లి: మండలంలో చినరామభద్రపురంలో రీ సర్వే పనులను తహసీల్దార్ ఆర్. నర్సింహమూర్తి మంగళవారం పరిశీలించారు. ఈ సర్వే పారదర్శకంగా పక్కాగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. రైతులంతా తమ పొలాల్లో అందుబాటులో ఉండాలన్నారు. తమ భూములకు సంబంధించిన ఆధారాలు తీసుకు వచ్చి సర్వే చేయించుకోవాలన్నారు. ఈ రీ సర్వే ద్వారా సరిహద్దు వివాదాలు చాలా వరకు పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వం ఉచితంగా నిర్వహించే రీసర్వేని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు.

పీ-4 సర్వే వేగవంతం

మునగపాక: పేదరిక నిర్మూలన కోసం చేపడుతున్న పీ-4 సర్వే వేగవంతమయ్యేలా చూడాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. స్థానిక మండల పరిషత్ హాలులో మంగళవారం వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వే పారదర్శకంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇంటింటికీ వెళ్లి కుటుంబ వివరాలు సేకరించాలని సూచించారు.

మునగపాకలో సిల్టు తొలగింపు



సిల్టు తొలగింపు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక నందీశ్వర కళా ప్రాంగణం ఎదురుగా కాలువల్లో పేరుకుపోయిన సిల్టు తొలగింపు పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి ముందు నీటి నిలువలు లేకుండా చూడాలన్నారు. తద్వారా దోమల బెడద ఉండదన్నారు. పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.

మునగపాకలో వాహన తనిఖీలు

మునగపాక: స్థానిక మెయిన్‌రోడ్డులో మంగళవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి రికార్డులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మన్మథరావు మాట్లాడుతూ ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌సీ ప్రకాశరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కపోతతో అవస్థలు



నిర్మానుష్యంగా మునగపాక మెయిన్‌రోడ్డు

మునగపాక: ఉక్కపోతతో మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. గత కొద్ది రోజులుగా ఎండతీవ్రత పెరిగిపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 11 గంటలకే ఎండ వేడిమి ఎక్కువకావడంతో ప్రయాణాలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రాకపోకలు సాగించేవారు తలకు టోపీ లేదా గొడుగులు పట్టుకొని రావాల్సి వస్తోంది. దీనిలో భాగంగా మంగళవారం ఎండ తీవ్రత కారణంగా మునగపాక మెయిన్‌రోడ్డు నిర్మానుష్యంగా కనిపించింది. రైతులు తమ పొలం పనులు వేగవంతంగా ముగించుకొని ఇళ్లకు చేరుకుంటున్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం : ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐల్లో 2025-26 విద్యా సంవత్సరానికి మొదటి విడత ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చునని జిల్లా కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసచార్యులు తెలిపారు. మే 24వ తేదీ లోపు అప్లికేషన్ ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన విద్యార్థులు దగ్గరలో గల గవర్నమెంట్ ఐటీఐలకు వెళ్లి మే 26వ తేదీలోపు సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9491813637, 9885596699, 8790741378 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

3వ తేదీన జాబ్ మేళా

నర్సీపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్‌లో ట్రైనీ సూపర్‌వైజర్స్, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఉద్యోగాలకు మే 3వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. బీఎస్సీ, ఎంఎస్సీ (కెమిస్ట్రీ) 2021-24లో ఉత్తీర్ణులైన వారు, ప్రస్తుతం డిగ్రీ, పీజీ ఆఖరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు ఉద్యోగానికి అర్హులన్నారు. 21 నుంచి 25 వయస్సు కలిగి ఉండాలని, తగిన ధ్రువపత్రాలతో ఆసక్తి గల విద్యార్థులు ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.



వాటర్ ప్యూరిఫైర్



ఆర్వో ప్లాంట్

ఆర్వో ప్లాంట్ల తనిఖీ శూన్యం

పల్లెకూ మంచి నీళ్ల వ్యాపారం

దెబ్బతింటున్న ప్రజారోగ్యం

తాగునీరు సురక్షితమేనా..!

కోటవురట్ల: వీరబ్రహ్మంగారు కాలజ్ఞానంలో ఎప్పుడో చెప్పారంట.. మంచినీళ్లను కొనుక్కుని తాగుతారని, మంచినీళ్ల వ్యాపారం పల్లెకూ పాకుతుందని... ప్రస్తుతం పల్లెల్లోని ఇదే పరిస్థితి ఉంది. ఎక్కడికెళ్లినా మంచినీళ్లను కొనుక్కునే తాగాల్సిన పరిస్థితులు వచ్చేశాయి. బయట మాట అటుంచి ఇప్పుడు ఇళ్లలోని మంచినీళ్లు కొనుక్కున్నవే. ఆర్థిక స్థోమత ఉన్నోళ్లు ఇంట్లో వాటర్ ప్యూరిఫైర్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీనికి అన్ని డబ్బులెందుకులే వాటర్ ప్లాంట్‌లో కొనుక్కుంటే పోలా అనుకున్న వాళ్లు మరికొందరు. అధిక శాతం ప్రజలు ఆర్వో ప్లాంట్లపైనే ఆధారపడి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఎక్కువగా ఆర్వో ప్లాంట్ల మంచినీళ్లను తాగితే శరీరానికి కావాల్సిన ఖనిజాలను కోల్పోయే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రజల అవసరాలకు తగ్గట్టుగా కొత్త వ్యాపారాలు కాలానుగుణంగా పుట్టుకొస్తూనే ఉంటాయి. అందులో మినరల్ వాటర్ పేరిట ప్రస్తుతం ఆర్వో వాటర్ అమ్మకాలు మంచి వ్యాపారంగా మారింది. మార్కెట్లోకి ఎన్నో కంపెనీ ఆర్వో యంత్రాలు తక్కువ ధరకే లభిస్తున్నాయి. దాంతో పల్లెల్లోనూ ఆర్వో ప్లాంట్లు ఇబ్బడిముబ్బడిగా వెలిశాయి. మార్కెట్లోకి వాటర్ ప్యూరిఫైర్లు కూడా ఎన్నో కంపెనీలు వచ్చేశాయి. తక్కువ ధరకే చాలా వాటర్ ప్యూరిఫైర్లు వచ్చేస్తున్నాయి. ఈ ప్యూరిఫైర్లు ఎంతవరకు నీటిని శుద్ధి చేస్తున్నాయి. నాణ్యత అంశాలను తెలుసుకోకుండానే తక్కువ ధరకే వస్తున్న ప్యూరిఫైర్లను ఇళ్లల్లో ఏర్పాటు చేసుకుని సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. వీటిలో నాణ్యత కలిగిన మంచి కంపెనీల ప్యూరిఫైర్లను వాడుకుంటే మంచిది.



ఆర్వో ప్లాంట్ వద్ద వాటర్ క్యాన్

కొరవడిన పర్యవేక్షణ..

ఆర్వో ప్లాంట్ల నిర్వహణపై సంబంధిత శాఖాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. అధికారులు కనీస తనిఖీలు చేయకపోవడంతో కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఆర్వో ప్లాంట్లలో ఫిల్టర్ చేసిన నీటిని ప్లాస్టిక్ క్యాన్లలో పట్టి దర్జాగా విక్రయిస్తున్నారు. వాస్తవానికి ఈ వాటర్ ప్లాంట్ల నిర్వహణకు అనుమతులు తీసుకోవలసి ఉంటుంది. కానీ ఎక్కడా అనుమతి తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. మినరల్ వాటర్‌గా అపోహపడుతున్న ఆర్వో వాటర్‌ను తాగితే అనారోగ్య సమస్యలు రావని జనం నమ్ముతున్నారు. దాంతో పల్లెల్లో సైతం ఆర్వో ప్లాంట్లు పుట్టుకొచ్చి జోరుగా నీళ్ల వ్యాపారం జరిగిపోతోంది. ఆర్వో ప్లాంట్ వద్ద 20 లీటర్ల క్యాను నీటికి రూ.10, డోర్ డెలివరీ చేస్తే రూ.30 నుంచి రూ.40 వసూళ్లు చేస్తున్నారు. ఇందులో కూలింగ్ వాటర్ అయితే 20 లీటర్ల క్యానుకు రూ.70 వరకు వసూళ్లు చేస్తున్నారు. వివాహాది శుభకార్యాలకు ఇదే వాటర్‌ని వినియోగిస్తున్నారు. పల్లెల్లో అయితే ప్లాస్టిక్ వాటర్ ప్యాకెట్లను బహిరంగంగానే విక్రయిస్తున్నారు. వాటర్ ప్యాకెట్లు వాడటం వల్ల ఎండ వేడికి రసాయనాలు వాటర్‌లో కలిసే ప్రమాదం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన ఆరోపణలు ఉన్నాయి. అధికారులు ఈ వాటర్ ప్లాంట్లను తనిఖీ చేసి నీటి సాంద్రత, ఫిల్టర్ల నాణ్యత, నీటి శుద్ధికి వినియోగిస్తున్న రసాయనాలు ఏ మేరకు వినియోగిస్తున్నారో తదితర అంశాలను నిర్ధారణ చేసుకోవలసి ఉంటుంది. కానీ అధికారులు ఎక్కడా కూడా ఆర్వో ప్లాంట్లను తనిఖీ చేసిన దాఖలాలు కనిపించవు.

వాల్టా చట్టానికి తూట్లు..

వాల్టా చట్టం ప్రకారం కొత్తగా బోరు వేసుకోవాలంటే రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి తీసుకోవలసి ఉంటుంది. దరఖాస్తు చేశాక పరిశీలన చేసి నీటి లభ్యతను బట్టి బోరు వేయడానికి అనుమతి ఇస్తారు. కానీ ఆర్వో వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు బోరు కోయడానికి గానీ, ప్లాంట్ నడపడానికి కానీ అనుమతి తీసుకోకుండానే అనధికారికంగా నిర్వహించి వాల్టా చట్టాన్ని తుంగలోకి తొక్కుతున్నారు. ఈ ప్లాంట్ల నిర్వహణకు 14 రకాల అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సర్టిఫికెట్, భూగర్భ జల సంస్థ, ఐఎస్‌ఐ, ఐఎస్‌వో, ల్యాబ్ పరీక్షా పత్రం, ఆర్‌డబ్ల్యూఎస్, పర్యావరణ శాఖల అనుమతులు తప్పనిసరి. ఇష్టానుసారంగా బోర్లు కోసి నిరంతరాయంగా నీటిని తోడడం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి.

నాణ్యత ఎప్పటికపుడు పరీక్షించాలి..



ఆర్వో ప్లాంట్లలో వాటర్ సురక్షితమని కచ్చితంగా చెప్పలేం. నిర్వాహకులు నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా రసాయనాలు వినియోగిస్తే ఆ నీళ్లు తాగేవారికి రోగాలు వచ్చే ప్రమాదం ఉంది. పైగా టీడీఎస్ నిబంధనల ప్రకారం లేకపోతే శరీరానికి కావలసిన పోషకాలు అందక అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. ప్లాస్టిక్ కవర్లలోని వాటర్, ప్లాస్టిక్ క్యాన్లు సరిగ్గా శుభ్రం చేయకుండా వినియోగించినా కలరా, టైఫాయిడ్, అతిసార, పచ్చకామెర్లు, కాలేయ, కిడ్నీ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. బోరు, బావి నీళ్లు, రక్షితనీటి పథకాల నీళ్లను మరిగించి చల్లార్చి వడకట్టి తాగితే ఆరోగ్యానికి మంచిది.

– డాక్టర్ సంతోష్‌కుమార్, వైద్యాధికారి, కె.వెంకటాపురం

అధ్వానంగా సాగునీటి కాలువ



తూటికాడతో దర్శనమిస్తున్న అనకాపల్లి ఆవ కాలువ

మునగపాక: మండలంలోని తోటాడ దరి గవర్ల అనకాపల్లి వద్ద అనకాపల్లి ఆవ కాలువ అధ్వానంగా తయారైంది. ఆవ కాలువంతా తూటికాడతో దర్శనమిస్తోంది. ఎగువ నుంచి వచ్చే సాగునీరు దిగువ ప్రాంతాలకు వెళ్లే అవకాశాలు కనిపించడం లేదు. సాగునీటి కాలువలపై ఆధారపడి పంటల పండించే రైతులు ఇక్కడ దుస్థితిని చూసి ఆందోళనకు గురవుతున్నారు. ఏటా సీజన్‌కు ముందుగానే సాగునీటి కాలువలను అభివృద్ధి చేయాల్సి ఉంది. అయితే సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారంటూ ఆవేదన చెందుతున్నారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు స్పందించి తూటికాడ నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆటోను ఢీకొట్టిన ప్రైవేటు బస్సు

ఐదుగురికి తీవ్ర గాయాలు







క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నక్కపల్లి: హైవేపై ఉద్దండపురం జంక్షన్‌లో మంగళవారం రాత్రి ఆటోను ప్రైవేటు బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అడ్డురోడ్డు నుంచి తుని వైపు వెళ్తున్న ఆటో ఉద్దండపురం జంక్షన్‌లో ప్రయాణికులను దించుతుండగా విశాఖ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏటికొప్పాకకు చెందిన చట్టబాజి సత్తిబాబు, పాయకరావుపేట మండలం రాజవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఏడిద అప్పన్న, ఉద్దండపురానికి చెందిన గాద ధనలక్ష్మి, కనక రంగలక్ష్మి, పాయకరావుపేటకు చెందిన వర్ల వెంకటరమణలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రులను నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే ప్రమాదానికి కారణమైన బస్సు ఆపకుండా వెళ్లిపోవడంతో పోలీసులు వెంబడించి పాయకరావుపేటలో పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞానానికి సోపానాలు



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం



గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు

కోటవురట్ల: గ్రంథాలయాల సందర్శనతో విజ్ఞానాన్ని పొందవచ్చని ఉపాధ్యాయుడు మస్తాన్ తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు గ్రంథాలయాల వల్ల కలిగే మేలును వివరించారు. చిన్నతనం నుంచి పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవాలని, తద్వారా ఉత్తమ ఫలితాలు సాధ్యపడతాయన్నారు. సచివాలయ ఉద్యోగి గౌస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు

నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు గ్రంథపాలకుడు కే జనార్దన్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన ఈ పోటీలకు 40 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడం, వారిలో పోటీతత్వాన్ని పెంచడం కోసం ఈ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జూన్ 6వ తేదీ వరకు ఈ సమ్మర్ క్యాంపు కొనసాగుతుందన్నారు.

పాయకరావుపేట: పట్టణంలో శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లిషు, యోగా, ఆటలు నేర్పించినట్లు గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణ్‌రావు తెలిపారు. రిసోర్స్ పర్సన్‌గా ఎస్.సీతారామయ్య, ఏపూరి శ్రీనివాసరాజు విద్యార్థులకు తరగతులు చెబుతున్నారు. 50 మంది విద్యార్థులు హాజరు కాగా, టెబుల్స్ బుక్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు.

కిశోర బాలికలపై ప్రత్యేక శ్రద్ధ



శిక్షణకు హాజరైన ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు



మాట్లాడుతున్న వైద్యాధికారి విమలగిరి

మునగపాక: కిశోర బాలికలు ఆరోగ్యవంతంగా ఉండేలా పోషక విలువలతో కూడిన ఆహారం అందించేలా చూడాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి కోరారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలకు కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బాలికలపై లైగింక దాడులు జరగకుండా అవగాహన కలిగించాలన్నారు. యుక్త వయస్సులో వచ్చే ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తూ ఎటువంటి ఇబ్బందులు పడకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

జనసేన పార్టీ పేరుతో అక్రమ వసూళ్లు

ఎస్.రాయవరం: జనసేన పార్టీ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తామని, కారుచౌకగా భూములు కొనిపిస్తామని లింగపల్లి జ్యోతికుమార్ లక్షలాది రూపాయలు అక్రమంగా వసూళ్లు చేశాడని ఆ పార్టీ ఎస్.రాయవరం మండలాధ్యక్షుడు పప్పల శివ తెలిపారు. బాధితులతో కలిసి అడ్డురోడ్డు జంక్షన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గోకులపాడు గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు జ్యోతికుమార్ కర్రివానిపాలెం, అచ్యుతాపురం మండలం జగన్నాథపురం, తిమ్మాపురం, చోడవరం మండలానికి చెందిన నిరుద్యోగుల నుంచి అక్రమంగా నగదు వసూళ్లు చేసినట్టు పేర్కొన్నారు. దీనిపై బాధితులతో కలిసి ఎస్.రాయవరం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ గెడ్డం బుజ్జితో కలిసి పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. బాధితులు న్యాయం చేయాలని హోం మంత్రికి ఫిర్యాదు చేస్తామన్నారు. బాధితుడు గట్టిన శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. మిగిలినవారు ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిర్యాదు చేసుకోవాలని సూచించినట్టు చెప్పామన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

యలమంచిలి రూరల్: స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ 51వ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు మంగళవారం తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గత కౌన్సిల్ సమావేశంలో పాలకవర్గం ఆమోదించిన అంచనా బడ్జెట్‌లో ప్రతిపాదించిన వివిధ పనులకు పరిపాలనా ఆమోదం తెలియజేయడానికి వీలుగా అజెండా రూపొందించినట్టు తెలిపారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో కేటాయింపులు, ఖర్చులకు సంబంధించి ఐదు అంశాలను అజెండాలో పొందుపరిచారు.

ఘనంగా పోలిపల్లెమ్మ తల్లి పండగ



పూజలు చేస్తున్న గౌరీలక్ష్మి, అప్పారావు దంపతులు

మునగపాక: మండలంలోని నాగవరంలో పోలిపల్లెమ్మ తల్లి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకున్నారు. మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి, అప్పారావు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉచిత పాలిసెట్ కోచింగ్ అభినందనీయం



పాలిసెట్ హాల్‌టికెట్లతో విద్యార్థులు

ఎస్.రాయవరం: పేద విద్యార్థులకు ఉచిత పాలిసెట్ కోచింగ్ ఇస్తున్న ఉపాధ్యాయులను ఎస్‌ఐ విభీషణరావు అభినందించారు. పీఆర్టీయూ ఆధ్వర్యంలో పెదగుమ్ములూరు పాఠశాలలో 25 రోజులుగా ఉచిత కోచింగ్ ఇస్తున్న ఉపాధ్యాయులను ఆయన సత్కరించారు. ఈ కోచింగ్‌తో వంద మందికి పైగా ప్రయోజనం చేకూరిందని ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు హాల్ టికెట్లు ఇచ్చారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, సమన్వయకర్త చోడిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

'తాడి' తరలింపుపై చురుగ్గా సర్వే



ఇంటింటి సర్వేలో మండల రెవెన్యూ అధికారులు

పరవాడ: అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు తాడి గ్రామ తరలింపు కోసం పునరావాస సర్వే చురుగ్గా సాగుతోందని మండల సర్వేయర్ శ్రీనివాసరావు తెలిపారు. రెండు రోజులుగా గ్రామంలో జరుగుతున్న సర్వేను మంగళవారం పరిశీలించి, సర్వే బృందానికి తగు సలహాలు, సూచనలు అందించారు. సర్వేలో ఎలాంటి లోపాలకు తావీయరాదన్నారు. సర్వే బృందానికి అవసరమైన ఆధారాలను అందించి, సహకరించాల్సిందిగా ప్రజలను కోరారు.